విధి నిర్వహణే
గొప్ప సేవగా
మురిసిపోయిన
అతనికి కనువిప్పు
కలిగించిన చిలకమ్మ!

# మాఊరి దేవత

కాకాని
కమల
కథ

''సిలకమ్మ చచ్చిపోయింది.

సిలకమ్మ చచ్చిపోయింది''

తూరుపు ఇంకా చీకట్లు విచ్చుకోనేలేదు.

బ్రష్‌మీద పేస్టు వేసుకుని పళ్లు తోముతూ వీధితలుపు తెరుచుకుని అరుగు చివరికి వచ్చి నిలుచున్న నాకు ''సిలకమ్మ సచ్చిపోయింది'' అన్న ఆ వార్త కొన్ని వందల గొంతుకలు అరిచి చెబుతున్నట్లుగా వినిపిస్తోంది.

హాహాకారంలా ఊరంతా మారుమ్రోగుతూంది ఆ వార్త.

ఎవరెవరో... చాలామంది ఆడవాళ్లు, మగవాళ్లు, పిల్లలు, పొలం పనిచేసుకునే రైతులు, కూలి నాలి చేసుకునే వాళ్లు ఒకరికొకరు చెప్పుకుంటూ ''సిలకమ్మ సచ్చిపోయింది'' అనుకుని ఒకర్ని ఒకరు కూడేసుకుంటూ పిలుచుకుంటూ పరుగులాంటి నడకతో ఎటో వెళ్తున్నారు.

నిద్రమంచాలమీంచి లేవనివాళ్లని కూడా తట్టి లేపి మరీ తీసుకువెళ్తున్నారు.


ఆ కేకలకి ఇళ్లల్లోంచి పూరిగుడిసెల్లోంచి, నిట్టాడి పాకల్లోంచి ఆడవాళ్లు, కావడి కొయ్యల్తోటి మగవాళ్లు పనులు ఆపుకుని పరుగుపరుగున రోడ్డుమీదకి వచ్చి రచ్చబండ చేరుతున్నారు.

''ఏందిరా అబ్బిగా''

మన సిలకమ్మ సచ్చిపోనాది మావా''

''అర్రెర్రె... ఎంత ఘోరం జరిగిపోనాదిరా! ఆ కన్నతల్లికి సావేంటిరా భగవంతుడికి నాయ్యం తెలియకపొయ్యె. వుండు మా ఆడోళ్లకి సెప్పి వస్త. ఓయ్ సీతాలు... లెగులెగు మన సిలకమ్మ సచ్చిపోనాదంట'' మరికొందరు ప్రతి గుడిసెముందు ఆగి చూరు పట్టుకుని లోపలికి తొంగిచూస్తూ పిలుపుమీద పిలుపు వేస్తున్నారు. అంతా హడావుడి.

పరుగులు...



ఎవరి ముఖాల్లో చూసినా ఆవేదన. దుఃఖం.
సన్నగా ఆడవాళ్ల ఏడుపులు.
చిన్నపిల్లల గోల.
అరుగుమీద కూర్చుని బ్రష్ చేస్తున్న నాకు

అంతా అయోమయంగా వుంది.
ఈ పల్లెటూరి వాతావరణం వింతగా వుంది.
ఎవరీ సిలకమ్మ?
ఆవిడ ఎవరో చచ్చిపోతే వీళ్లంతా కట్టకట్టుకుని

వెళ్లడం ఏమిటి?

అదేదో ప్రళయం వచ్చినట్టు ఈ అరుపులు పరుగులు ఎందుకు?

ఎవరైనా చచ్చిపోతే -

వాళ్ల తాలూకు బంధువులు, స్నేహితులు, పరిచయస్తులు చూడడానికి వెళ్తారు. అంతేగాని -

ఊరు ఊరంతా కట్ట కట్టుకుని పైగా ఒకరికొకరు ఇలా కూడగట్టుకుని వెళతారా?

చూడబోతే ఈ సిలకమ్మ ఎవరోగాని ఊరు ఊరంతటికీ చుట్టంలాగుంది. అసలు ఈ పల్లెటూళ్ల వ్యవహారాలే ఇంత.

తెల్లారి లేవగానే ఓ పేపరు చూద్దామనిగానీ రేడియో న్యూస్ విందామనిగానీ వుండదు. ఏ ఇంట్లో పురుడు అయిందో, ఏ అత్త, కోడలు తగాదా పడ్డారో ఎవరింట్లో ఆస్తి పంపకాలు గొడవలు పడ్డారో, ఏ ఇంట్లో మగడు భార్యని తన్నాడో, ఏ ఆవుకి ఎలాంటి దూడ పుట్టిందో.... ఇది వ్యవహారం.

చిరాగ్గా నిట్టూర్చి ఆపుకున్నాను.

నేను ఈ ఊరికి వచ్చి సరిగ్గా వారం రోజులు అయింది. ఇంకా పూర్తిగా ఊరి ముఖం చూడలేదు. కొత్తగా ట్రాన్స్‌ఫర్‌మీద ఈ సమితికి గ్రామ సేవికగా వచ్చాను. ఆడపిల్లనని జాలిపడి సమితి ప్రెసిడెంట్ ఈ ఇల్లు అద్దెకు చూపించాడు. వచ్చిన దగ్గరనుంచి ఇల్లు శుభ్రం చేసుకోవడం, సామాను సర్దుకోవడం, సరుకులు అమర్చుకోవడం, వగైరా పన్లతోనే సరిపోయింది.

రెండు రోజుల క్రితం ఆఫీసుకు వెళ్లి జాయినింగ్ రిపోర్టు ఇచ్చి, నా డెస్క్‌కి సంబంధించిన కాగితాల వర్కు చూసుకుని కొంచెం స్థిమితపడ్డాను.

బి.డి.బి. పిలిచి ''ఎప్పట్నుంచి డ్యూటీ చేద్దామనుకుంటున్నారు?

అని అడాడు.

ఇవ్వాళ ఒకరోజు కాస్త రెస్టు తీసుకుని రేపట్నుంచి వెడదామనుకుంటున్నాను'' అన్నాను.

''ఇక్కడ ప్రజలు ముఖ్యంగా స్త్రీలు చాలా వెనుకబడినవారు. పైగా చదువు, సంస్కారం బొత్తిగా తెలియని మూర్ఖులు. ఒకరకంగా అడవి జాతులని చెప్పినా తప్పులేదు. మీరు ఎలా హ్యాండిల్ చేస్తారో'' అన్నాడు నాకేసి ఎగాదిగా చూస్తూ.

నేను చిన్నగా నవ్వి ఊరుకున్నాను.

బి.డి.వి. అనుభవజ్ఞుడే కాని సమితి ఈ మధ్యనే కొత్తగా ఏర్పాటైంది.

''గిరిజన ప్రాంతం గ్రామీణ ప్రాంతంగా రూపుదిద్దుకుని, ఇప్పుడిప్పుడే అభివృద్ధి ప్రాంతంగా ప్రభుత్వం గుర్తింపుకు వచ్చింది. 'బ్లాక్' వచ్చాక స్త్రీ జనోద్ధరణకోసం అడుగుపెట్టిన మొట్టమొదటి జి.ఎస్.ని నేనే. కాబట్టి ఇక్కడ ఏ చిన్న మహిళా సంఘంగాని, ఇతర స్త్రీ అభివృద్ధి సేవా పథకంకాని మొదలైనా నా పేరు చిరస్థాయిగా వుండిపోతుంది'' అనుకుంటూ కాస్త గర్వంగా ఇంటికి వచ్చాను.

ఆ రాత్రంతా ఇవే ఆలోచనలు.

మర్నాడు చీకట్లు విడవకుండానే లేచాను.

తొందరగా నా పనులు పూర్తిచేసుకుని ఊళ్లోకి వెళ్లి పదిమంది ఆడంగుల్ని కూడగట్టుకోవాలి. ముందు ఊరి పెద్దల భార్యల్ని కలవాలి. ఊళ్లో మహిళామండలి లేడీస్ క్లబ్‌లాంటివి స్థాపించాలి. బాల్వాడి, డ్రెస్‌మేకింగ్ సెంటర్‌లాంటి వాటి ప్రాముఖ్యత వివరించాలి. ఆడవాళ్లని చైతన్యవంతుల్ని చేయాలి.

అనియత విద్యాకేంద్రాల్ని స్థాపించి, అడల్ట్ ఎడ్యుకేషన్ మొదలుపెట్టి అక్షరజ్ఞానం కలిగించి, చదువుయొక్క ప్రాముఖ్యతను వివరించాలి. ఇంకా కుటుంబ నియంత్రణ ప్రచారం, తప్పనిసరిగా కొన్ని కేసులు నమోదుచేయించడం వగైరా బాధ్యతలన్నీ వుండనే వున్నాయ్.

గ్రామ సేవిక ఉద్యోగం అంటేనే ఒక విధంగా

గ్రామాభ్యుదయానికి సంఘ సేవకి నడుం కట్టడమే.

కాని ఈ పల్లెటూరి ఆడవాళ్లతో పెద్ద చిక్కు. ఒక పట్టాన చెప్పింది అర్థం చేసుకోరు. మహిళ మండలి, కుట్టు సెంటర్లు అంటే ఆసక్తి చూపించరు.

దానికి బదులు పొలంపన్లకో దంపుళ్లకో వెడితే కూలి డబ్బులు గిడతాయంటారు. పోనీ పిల్లల్ని బాల్వాడీకి పంపమన్నా పంపరు.

ఏ పెద్ద కామందు దగ్గరో పిల్లగాడ్ని గొడ్లు కాయడానికి పెడితే ఏడాదికి సరిపడా ధాన్యం గింజలు వస్తాయని ఆశపడతారు. పిల్లలు పుట్టకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోమంటే పాపం తగులుతుందని వాదిస్తారు.

"నీకేంది తల్లీ కట్టం? మా పిల్లల్ని నువ్వేమన్నా సాకుతున్నావా? ఏమన్నావా?" అని అడుగుతారు.

పేడలో పురుగుల్లా కులకొల్లాడుతూ ఆ రొచ్చులో, ఆ కంపులోనే బ్రతకడానికి ఇష్టపడతారుగానీ అభ్యుదయ పథంలోకి పయనించాలన్న కనీస ఆలోచన వీళ్లకి వుండదు. అసలు స్త్రీ జాతికి ఇలాంటి వర్గ స్త్రీలే చీడపురుగులు అనిపిస్తుంది నాకు ఈ పల్లెటూరి గబ్బిలాయిల్ని చూస్తుంటే.


ముఖ్యంగా సమాజ సేవకి అంకితమై, స్త్రీ అభ్యున్నతికి నడుం కట్టుకున్న 'నాలాంటి' వాళ్ల విలువ వీళ్లకి అసలే తెలియదు. అయినా-

అవన్నీ భరిస్తూ వాళ్లకి అర్థమయేలా నచ్చచెప్పడం, మహిళామండలి స్థాపించడం, కుట్టు సెంటరు నడపడం, అక్షరజ్ఞానం కల్పించడం... కడుపుకి తిండి ఎంత అవసరమో మెదడుకి విజ్ఞానం అంతే అవసరం అన్న విచక్షణ కల్పించడం, పైగా కుటుంబ నియంత్రణ కేసులు సిద్ధం చేయడం... ఇదంతా ఒక యజ్ఞం.

అయినా నా శక్తి సామర్థ్యాలమీద నమ్మకం వుంది. నా మాటల చాతుర్యంతో ఈ గ్రామీణ స్త్రీలని సంఘటితం చేయడం, వాళ్లకి సమాజ సేవాధర్మం గురించి వివరించడం, చైతన్యవంతుల్ని చెయ్యడం, నాకు ఈ ఆరేళ్ల సర్వీసులో బాగా అనుభవం అయింది.

మంచి స్కిల్ వున్న గ్రామ సేవికగా పేరు సంపాదించుకున్నాను. బ్లాకాఫీసర్లు నేను వాళ్ల సమితికి వస్తున్నానంటే సంబరపడుతున్నారు.

నేను పనిచేసిన సమితుల్లో ఇప్పుడు స్త్రీ మహిళా సంఘాలు, బాల్వాడి సెంటర్లు, లేడీస్ క్లబ్బులు,



అడ్వాన్స్‌డ్ స్టేజిల్లో వున్నాయి. నాకు తొందర్లోనే ఎం.ఎస్‌గా ప్రమోషన్ రావచ్చనికూడా అంతా అనుకుంటున్నారు.

కాని ఉదయంవేళ లేచి చీకట్లో పళ్ళు తోముకోడానికి వీధి అరుగుమీదకి వచ్చిన నాకు చావుకబురు చల్లగా వినిపించింది. ఆ చావు తల్చుకుని ఊరుఊరంతా తల్లడిల్లడం నాకు మరింత ఆశ్చర్యాన్ని కలిగించింది.

అసలు...

ఎవరీ చిలకమ్మ?

ఏ మినిస్టరో చచ్చిపోయినట్లు వీళ్లంతా ఎందుకింత హడావుడి చేస్తున్నారు?

ఆలోచనల మధ్య ఇంటి పని వంటపని ముగించుకుని స్నానం చేసి లేత పసుపురంగు ఖటావ్ వాయిల్ చేరీలో ముస్తాబయ్యాను. అప్పటికే బాగా ఎండ పొడ వస్తూంది.

అందుకే కూలింగ్ గ్లాసెస్ పెట్టుకున్నాను. హ్యాండ్ బ్యాగ్ తీసుకుని చెప్పులేసుకుని వీధిలోకి వచ్చాను.

ఈ వారమంతా ఈ ఊళ్లో పని చూసుకుని కనీసం వచ్చేవారంలోనైనా ప్రక్క గ్రామాలకి వెళ్లాలి'' అనుకుంటూ వీధి చివరిదాకా నడిచి ప్రక్కకి తిరిగాను.

అంతే!

హఠాత్తుగా నా నడక ఆగిపోయింది. దూరంగా ఎత్తు అరుగుల ఇంటిముందు జనం గుంపు కట్టారు. ఊరుఊరంతా అక్కడే చేరిందా అన్నట్లు పిల్లా పిచుక ఆడామగా అంతా గుమిగూడారు.

అది చాలదన్నట్లు గ్రామ పెద్ద తలకాయలుకూడా ఆ అరుగుమీద సమావేశం అయి విషాదంగా ఏదో చర్చించుకోవడం నాకు విస్మయం కలిగించింది. అయితే ఎక్కడ చూసినా దుఃఖమే ధ్వనిస్తోంది. ఎవ్వరి ముఖాల్లోనూ మచ్చుకైనా ఆనందపు ఛాయలు లేవు. చాలామంది ఆడవాళ్ల ఎర్రబడ్డ కళ్లని పయిట చెంగుల్తో తుడుచుకుంటూ ముక్కులు ఎగబీల్చుకుంటూ నాకు సందు చివరే ఎదురొచ్చారు. ఎవరికేసి చూసినా ఏడిచినట్లు కన్నీటి చెరువుల్లా కనిపిస్తున్నాయి ముఖాలు. చీకట్లు విడకుండా కూలినాలికి పోయే ఆ పాటకజనం, లేస్తూనే చద్దికంచాలు ముందు పెట్టుకునే ముసలి ముతక, ఆ రోజు మాత్రం అసలు ఆ విషయాలే పట్టనట్టు ఏ పని చేతకాని వాళ్లల్లా కాళ్లు చేతులు చచ్చుబడినట్లు వుండిపోవడం నాకు మరింత ఆశ్చర్యం కలిగించింది.

ఆ చిలకమ్మ ఎవరోగాని దీనికంతటికి ఆవిడ చచ్చిపోవడమే!

కాని -

ఇంతకి అసలు ఆ చిలకమ్మ ఎవరో నాకు ఇంకా అంతుపట్టలేదు. అంతా అయోమయంగా వుంది. అందుకే ఏడుపు ముఖాలతో నాకు ఎదురొచ్చిన ఆడంగుల్ని చెయ్యి పట్టుకుని ఆపి -

''ఏమిటి? ఏమయింది?'' అన్నాను.

కళ్లజోడు, భుజాన బ్యాగుతో పట్నం దొరసానిలా టిప్‌టాప్‌గా వున్న నాకేసి ఒకసారి ఎగాదిగా చూసి, బెదిరినట్లు ఒక అడుగు వెనక్కి వేసి -

''సిలకమ్మ సచ్చిపోయింది'' అన్నారు ముక్తకంఠంగా.

ఆమాటలు చెప్తున్నప్పుడు వాళ్ల కంఠంలో దుఃఖం పొంగిపొర్లింది.

''ఉహు.. హు...'' అంటూ దుఃఖోద్వేగాన్ని ఆపుకున్నారు.

''ఎవరా చిలకమ్మ. ఆవిడ చచ్చిపోతే మీరంతా ఎందుకేడుస్తున్నారు. ఊరంతా కదిలిపోతుందేమిటి?''

నాకు అర్థంకాలేదు.

కళ్లు ముడిచి ''ఆవిడ అటే ఆ చిలకమ్మ బాగా

ధనవంతురాలా?'' అన్నాను. ''ఎంతైనా డబ్బుకి లోకం దాసోహం కదా?'' అనుకుంటూ.

నెత్తిమీద పెద్ద కొప్పు, ముక్కుకి అడ్డబాసతో వున్న ఒక గ్రామీణి ''కాదు'' అన్నట్లు తల అటు ఇటు ఊపింది.

''బాగా ఫేమస్ లేడీయా? లేక పెద్ద గవర్నమెంట్ ఎంప్లాయా? అదీగాక ఆమె భర్త వివిపినా?'' ఆతృతగా గబగబా ప్రశ్నమీద ప్రశ్న వేశాను.

వాళ్లంతా తెల్లబోయినట్లు నాకేసి చూశారు.

''ఏమో! అయ్యన్నీ మాకు తెల్వావు'' అన్నారు.

అయితే మీకు తెల్సింది ఏమిటో నాకు చెప్పండి'' నా కంఠంలో నాకే తెలియని విసుగు.

వాళ్లు ఒకళ్ల ముఖాలు ఒకళ్లు చూసుకున్నారు. మళ్లీ నేనే ''అసలు చిలకమ్మ ఎవరు? పోనీ నేనెవరో తెలుసా? గవర్నమెంట్ ఎంప్లాయిని, జి.ఎస్.ని. మీ ఊరిని బాగుచెయ్యడం కోసం మీ ఊరి ఆడవాళ్లని ఉద్ధరించడంకోసం వచ్చాను. మీకు సేవ చేయాలని, విద్య, వివేకం లేని మిమ్మల్ని విజ్ఞానవంతుల్ని చేయాలని నా ఆశయం. కానీ మీరెవ్వరూ నన్ను పట్టించుకోవడంలేదు. నన్నుచూసి కూడా తప్పించుకుపోతున్నారు. నేను పిలిచినా పలకడం లేదు. ఎవరో చిలకమ్మ చచ్చిపోయిందని పరుగెత్తుతున్నారు. అసలు ఎవరావిడ? ఆవిడ గురించి నాకు వివరంగా చెప్పండి'' వాళ్లని చెయ్యి పట్టుకుని ఆపి గద్దించినట్లు అడిగాను.

స్టయిల్‌గా మంచి డ్రెస్‌తో వున్న నన్ను చూడగానే వాళ్లకి ఏదో అర్థం అయింది. గవర్నమెంట్ ఉద్యోగస్తులన్నా పోలీసులన్నా వాళ్లకి భయం. అందుకే కాస్త జంకినట్లు నోళ్లు విప్పరు.

వాళ్లు చెప్పిన మాటల సారాంశం ఇది:

''చిలకమ్మ ధనవంతురాలుకాదు. గుర్తింపు వున్న ప్రభుత్వ అధికారి అసలేకాదు. ఆమె భర్త వివిపి అంతకన్నా కాదు. అసలు ఆమెకి వుండడానికి ఇల్లు, తినడానికి తిండికూడా లేవు. అనాథ. చాలా ఏళ్ల క్రితం ఆ ఊరి పెంటకుప్పమీద ఒకరోజు తెల్లవారుజామున కేరుకేరుమని పసిబిడ్డ ఏడుపు వినిపించింది. ఊరి జనమంతా పోగై ఆ బిడ్డ పెంటమీంచి ఇవతలకి తీశారు. ఎవరు కన్నారో... ఎందుకు పారేశారో...

పట్నం పోలీసుల్ని పిలుద్దాం అన్నారు ఎవరో గుంపులోంచి.

''ఆ ఇంతదానికి పోలీసులెందుకురా. ఇంత

## పెళ్లి

''ఎలాగైనా మనం వచ్చేనెలలో పెళ్లిచేసుకుందాం?'' కోపంగా అంది కాంతం.

''ఏమిటి? మనం పెళ్లిచేసుకోవడం నాకిష్టం లేనట్లు మాట్లాడతావ్! అక్కడ మా ఆవిడ ఒప్పుకోనవసరంలేదనుకున్నావా?'' అంతకంటే గట్టిగా చెప్పాడు.

- ఎ.పుల్లారావు (సికింద్రాబాద్)



ఊర్లో ఆ పసిది బతకలేదా? ఎర్రగా సిలకలా ఎంత ముద్దుగుండాదో సూడండి. రాంయిలాంటి ఆడదెవరో గొడ్డులా కని దీన్ని పెంటమీద పారేస్తే పారెయ్యనివ్వండి. కాని మనం రాళ్లం కాదుకదా? ఏడనుంచో ఎగిరి మనూరికొచ్చిన సిలక ఇది'' అన్నాడు ఊరిపెద్ద.

అంతే!

ఊరంతా తల్లి అయి 'రామసిలక' అంటూ ఆ బిడ్డని పెంచింది. ఆ బిడ్డ అలా పెరిగి పెద్దదయింది. ఆ అనాధే ఈ చిలకమ్మ''

''అలాగా? పెళ్లయిందా?'' అన్నాను విస్తుపోతూ.

''లేదు. సిలక్కి పదారేళ్లు వచ్చాయి. పంతులుగారు ఏదన్నా సిన్న సంబంధం చూసి పెళ్లిసేద్దాం అన్నారు. అంతా సరే అనుకున్నాం. కాని ...'' అంటూ ఆగిపోయి కాస్త అనుమానంతో పక్కకి చూసింది నెత్తిన కొప్పు పెట్టుకున్న స్త్రీ.

''ఏమయ్యింది'' రెట్టించాను. నా గొంతులో నాకే తెలియని ఉత్సుకత.

ఆ గుంపులోంచి ఇంకో స్త్రీ నోరు విప్పింది.

''ఏమవుటానికైనా ఏముందిలే దొరసాని? చిలకమ్మ పేరుకి తగినట్లే అందంగా వుండేది. పదారేళ్ల పంచదార సిలక. ఊళ్లో ఏ ఎదవకన్ను పడిందో. ఓ రేత్తిరి ఆ పిల్లదాన్ని కళంకం సేసినాడు. అంతే దాని పెళ్లిఊసు ఆగిపోయింది.''

నేను వ్యంగ్యంగా చూశాను.

''ఊ... అయితే అలాంటి చిలక చచ్చిపోతేనా మీరంతా ఇలా గగ్గోలు పడి ఏడుస్తున్నది. పన్లు మానుకుని పరుగెత్తుతున్నది. కాలం స్తంభించిపోయినట్లు ఆ చిలకమ్మ శవం చుట్టూ చేరి భజన చేస్తున్నది?''

ఆ గ్రామీణ స్త్రీలకి కొంచెంసేపు నా మాటలకి అర్థం బోధపడలేదు. కాని నేను ఏదోకాని మాట అన్నానని మాత్రం గ్రహించుకున్నట్లున్నారు.

అందుకే కాస్త కోపంగా చెయ్యి కదిలిస్తూ అన్నారు.

''ఆ సిలకమ్మ మడిసి ఎలాంటిదైనా మనసు శానా మంచిది. దొరసాని. మా ఊరి బిడ్డ, మా అందరికి తల్లో నాలుక. నలుగురు కూడే రాదారి. రాదారి మూసుకుపోతే రాకపోకలు జరుగుతయ్యా? జరుగవు. మా సిలకమ్మ లేకపోతే మా ఊరి గతి అంతే''

''ఆ..?''

''అవును దొరసాని. రెక్కలు ఇరుసుకుని చాకిరి చేస్తుంది. ఎవురింట్లో పెండ్లి పేరంటం అయినా మూడొంతులు పని సిలకమ్మదే. దంపుళ్లు, ఊరగాయలు, ఒడియాలు ఎండబెట్టడం, పిండివంటలు, ఇళ్లు అలంకరించడం, అతిథిమర్యాదలు, చిన్న, పెద్ద అన్ని పన్లు సిలకమ్మవే. ఎవురింట్లోనైనా చావు డప్పు మోగినా ముందు వెళ్లి ఆళ్లని ఆదుకునేది, శ్మశానంకాడిదాకా సాగనంపేది, ఇల్లు అలికి దీపం పెట్టేది, దినాలు ఎళ్లేదాకా ఎట్టిచాకిరి చేసెడిది చిలకమ్మే. మా అందరికీ సంసారాలు, పిల్లా మేకా. కాని సిలకమ్మకేముంది? ఊరంతా ఆమె ఇల్లేగదా?''

''అంతేగాదు తల్లీ... మేమంతా కూలినాలికెళ్లినా మా చంటి పిల్లల్ని కంటికి రెప్పలా చూసుకుని ఆలనా పాలనా కనిపెట్టేది. మా ఇండ్లలో ముక్కి మూలిగే ముసలి ముతక అతిగతి కనుక్కునేది మా సిలకమ్మే...''

''ఊళ్లో అమ్మతల్లికి కోపం వచ్చి అంటువ్యాధులు సోకినా, కలరా మశూచి మడుసుల్ని మాడ్చేసినా చావుభయం లేకుండా అందరికీ ఒళ్లుకడిగి మందు, మాకు రాసి ఇళ్లు కడిగి సేవలు చేసేది. ఆళ్ల కక్కులు, ఉమ్ములు ఎత్తేది మా సిలకమ్మే. ఆఖరికి అమ్మోరికి జాతర వస్తే సంబరాలక్కి

ముందుండి జరిపించేది మా సిలకమ్మే...

అత్తకోడళ్ల మధ్య తగాదాలువచ్చినా భార్యాభర్తల మధ్య గొడవలు వచ్చినా ఆటిని చిటికెలో సక్కదిద్ది అందర్నీ కూడేసి నవ్వించేది ఆ బంగారు తల్లే. ఆదేం ఇసిత్రమో... ఎలాంటి మగాడూ సిలకమ్మసెపితే బుద్ధిగా ఇనాల్సిందే... ఏం మంతరం ఏసేదో ఏం తంతరం సేసేదో! సిలకమ్మ సెడిపోయిందని, పతిత అని, తన అందసందాలతో మగాళ్లని ఆకట్టుకుని సెప్పినట్టు ఇనేలా సేస్తుందని అన్నవాళ్లుకూడా లేకపోలేదు. కాని అదేమని ఎదుటపడి నిలదీసినవాళ్లు లేరు''

''ఎందుకని?'' ఎందుకంటే దొరసాని సిలకమ్మ ఏ పని చేసినా పది కుటుంబాలు సల్లగా నిలబెట్టిందేగాని కూలగొట్టలేదు.

ఈ ఊరివాళ్ల పాడుబుద్ధితో ఆమె అందాన్ని కొల్లగొట్టి ఆమె బతుకు పాడుసేసినా సిలకమ్మ ఈ ఊరికంతట సేవసేసింది. ఈ ఊరి బాగుకోసం కట్టుబాటుకోసం నడుంగట్టుకుని ఇల్లిల్లు తిరిగింది. ఈ ఊరికి సాకిరి సేసి సేసి ఆమె కాళ్లు, చేతులు అరిగిపోయినయి. స్వంత తల్లి దండ్రి సచ్చిపోయినా బెంగటిల్లుదారో లేదోగాని రేపట్నుంచి సిలకమ్మకోసం మా పిల్ల మేక బెంగటిల్లుతాయి. అట్లాంటి మా ఊరి దేవత సచ్చిపోతే ఏడవకుండా ఎట్టా వుండమంటావ్ తల్లీ? రేపటిసంది మేం కూలినాలికి పోతే మా సంటి వెంట పిల్లగాళ్లని కనిపెట్టుకుని సూసుకునేదెవరు? దగ్గుతూ మూలుగుతూ మంచంలోని ముసలోళ్లకి ఎలపరం లేకుండ ఆసేవలు సేసెడిది ఎవరు? మా కొంపలు కూల్చకుండా మా తగాదాలు తీర్చి మా సంసారాలు నిలబెట్టేదెవరు?

పిడికెడు మెతుకులు, పాతకోకకోసం ఒళ్లు అరిగిపోయేలా మాకీ సేవలు సేసెడిది ఎవరు?


మా ఊరంతా తల్లికి రుణపడిపోనాది.

అందుకే కనీసం ఇలా ఏడిసి అయినా రుణం తీరుసుకోవద్దంటావా? సెప్పు తల్లీ? అనాథగా మా ఊరికి వచ్చి మమ్మల్ని అనాథల్ని సేసింది సిలకమ్మ. దేవుడు న్నయినా తీసుకుపోయి గందా?....'' చెప్తూ చెప్తూనే ఆ గ్రామీణ స్త్రీ గొల్లుమంది. తక్కిన గుంపులో వాళ్లంతా కూడా వలవల కన్నీరు కారుస్తూ కళ్లు తుడుచుకున్నారు.

చిలకమ్మ....

చిలకమ్మ...

చిలకమ్మ...



## ప్రయాణం రికార్డు

'మేరియన్ హార్ట్' అనే 85 ఏళ్ల వృద్ధురాలు (మేరియన్స్) ఒక్క ఇంజనే ఉన్న విమానంలో ఒంటరిగా ఖండాంతర ప్రయాణం చేయగలిగింది.

జోహ్‌బెర్‌జెర్ అను ఆస్ట్రేలియా దేశస్థుడు కాళ్లు పైకెత్తి చేతులపై రోజుకు రెండు మైళ్ల చొప్పున 205 మైళ్లు నడిచాడు.

1893లో చార్లెస్ టెర్రివట్ సైకిల్‌పై 1550 మైళ్లు 14 రోజులు 6 గంటల 38 నిమిషాల్లో ప్రయాణించాడు.

-శ్రీశారద

చిన్న, పెద్ద, పిల్ల, మేక, ఆడ, మగ, ముసలి ముతక ఎవరినోటవిన్నా ఇదే పేరు. నా తల గిర్రున తిరగబడింది. నా కాళ్లకింద భూమి కదిలిపోతూంది.

గ్రామ సేవికగా ఆరు సంవత్సరాలపైగా అనుభవం వుంది. నా చేతులమీదుగా ఎన్నో మహిళా మండల్స్‌ని, బాల్వాడీ సెంటర్స్‌ని స్థాపిచాను. అడల్ట్ ఎడ్యుకేషన్ పేరుతో పిడకలు చరిచేవాళ్లకు కూడా అంతో ఇంతో అక్షరజ్ఞానం కలిగించాను. కాని నా పేరు ఎక్కడ పొరపాట్నకూడా వినిపించదు. ఎవరి నాలికలమీద నా పేరు కనీసంగానైనా నలగడంలేదు. నా గురించి నేను 'ఫలానా' అని చెప్పుకుంటేనేగాని గుర్తింపులేని గతిలో వున్నాను.

కాని -

ఒక అనాధ... పతిత అని ముద్రపడిన స్త్రీ పేరు ఊరంతా మారుమ్రోగుతోంది.

ఆమె మరణానికి ఊరు ఊరంతా తల్లడిల్లుతోంది.

చిలకమ్మ.

ఊరివాళ్లందరికి అది ఒక 'సేవ' అనుకోకుండా నిస్వార్థంగా చాకిరి చేసింది.

ఎదుటి మనిషిని పరాయి మనిషి అనుకున్నప్పుడే సేవ, త్యాగం అన్న ఆలోచనలు వస్తాయి. పేరుకోసం గుర్తింపుకోసం తాపత్రయం కలుగుతుంది.

కాని చిలకమ్మ అందరూ తన వాళ్లే అనుకుంది.

ఆడ, మగ, పేద, ధనిక అన్న తేడా లేకుండా వాళ్లకి తన శక్తిమేర చేయూతనిచ్చింది.

మరి అలాంటి చిలకమ్మ చచ్చిపోయింది. నాకు తెలియకుండానే నా గుండె కలుక్కుమంది. నా కళ్లనిండా నీళ్లు నిండి చుక్కాచుక్కాగా నా చెంపలపై జారసాగాయి.

గ్రామ రచ్చ సావడి ముందు దడికట్టిన జనాన్ని తోసుకుంటూ ముందుకి వెళ్లి తొంగి చూశాను. చాపమీద చిలకమ్మ శవాన్ని పడుకోబెట్టారు.

బంతి, చామంతి, గన్నేరు, పారిజాతం, మందార, పున్నాగలు, మరెన్నో పూలు రాసులుగా శవాన్ని కప్పేశాయి. అంతా గిరిజనులు. కొండ కోనలు తిరిగి పిల్లలు బుట్టల్తో ఏరుకొచ్చిన పూలన్నీ శవంమీద చల్లారు. నుదుట పెద్ద కుంకుమబొట్టు పెట్టి చెంపలకి పసుపురాసి శవాన్ని అలంకరిస్తున్నారు. ముత్తయిదువలు.

చిలకమ్మ శవం కేసి చూస్తున్న నాకు -

''సంఘసేవ చెయ్యడానికి, ఆడవాళ్లని ఉద్ధరించడానికి పెద్ద చదువులు, గవర్నమెంట్ ఉద్యోగం అక్కర్లేదు. మానవసేవే మాధవసేవ అనుకుంటే నాలాంటి అనాధలుకూడా అర్హులై'' అన్నట్టు తోచింది చిలకమ్మ శవం.

నా అంతరాంతరాలలో అజ్ఞానపు చీకట్లు తొలగిపోతున్నట్లు అహంకారపు తెరలు కరిగిపోయి నాలో లోలోన దివ్యజ్ఞానజ్యోతి వెలిగినట్లు ఒక సన్నని అనుభూతి.

నా కళ్లనుంచి ధారలుగా జారిపోతున్న కన్నీటిని తుడుచుకుంటూ తల ఎత్తిన నాకు - ఎదురుగా రచ్చ సావిట్లో గోడకి వ్రేలాడుతున్న గాంధీతాత పటం బోసినోరు తెరిచి నవ్వుతూ కనిపించింది.

''రఘుపతి రాఘవ రాజారాం, పతిత పావన సీతారాం'' అంటూ పాడుతూ శవాన్ని ఎత్తుతున్నారు. వాళ్లతో కలిసిగొంతు కలుపుతూ నేను శవం వెనుక ఊరేగింపులో కలిశాను.